

సాక్షి
చిత్తూరు
శనివారం ၊ 3 ၊ జూన్ ၊ 2023



వైభవం..గోవిందుని రథోత్సవం

తిరుపతిలో గోవిందరాజస్వామి రథోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. అశేష భక్తులు రథం లాగి తన్మయత్వం చెందారు. - 8లో



తోతాపురి వచ్చేస్తోంది

జిల్లాలో తోతాపురి మామిడి రకం సీజన్ ప్రారంభం కానుంది. పల్ప్ ఫ్యాక్టరీలు రైతులతో ఒప్పందాలు చేసుకుంటున్నాయి. - 8లో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	41	28
తిరుపతి	42	29
తిరుమల	37	24
గూడూరు	43	31
నగరి	42	29

న్యూస్‌రీల్

ఆగని గజ దాడులు



ఏనుగులు ధ్వంసం చేసిన గుడిసె

ఐరాల: మండలంలోని చుక్కావారిపల్లె మామిడి తోటల్లోకి ఏనుగుల గుంపు పదే పదే చొరబడుతూ పంటలకు తీవ్రంగా నష్టం కలిగిస్తున్నాయి. గురువారం రాత్రి గ్రామానికి చెందిన రైతు రఘునాథ్‌రెడ్డి మామిడి తోటపై ఏనుగులు విరుచుకుపడ్డాయి. మామిడి చెట్ల కొమ్మలను విరిచేశాయి. సుమారు రెండు టన్నుల కాయలను తిని, తొక్కి విధ్వంసం సృష్టించాయి. తోటలో ఉన్న గుడిసెను ధ్వంసం చేసి, నిత్యావసర సామగ్రిని నాశనం చేశాయి. తోటలో ఉంచిన బాలాజీ స్కూటీని రోడ్డుపై పడేసి, తొక్కి ధ్వంసం చేశాయి. ఏనుగుల దాడిలో సుమారు రూ.లక్ష నష్టం వాటిలినట్లు బాధిత రైతు తెలిపారు.

బడి ఈడు పిల్లలు బడిలోనే..



మాట్లాడుతున్న ఎంపీడీఓ గౌరి

పూతలపట్టు: బడిఈడు పిల్లలు పనిలో కాకుండా బడిలో ఉండాలని జిల్లా సహాయ కార్మిక అధికారి జగదీశ్‌బాబు అన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనలో భాగంగా శుక్రవారం పూతలపట్టు ఎంపీడీఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దుకాణాలు, ఇటుకబట్టీలు, మెకానిక్ షాపుల్లో బాల కార్మికులుగా పనిచేస్తున్న వారిని గుర్తించి చదువుపై అవగాహన కల్పించాలని మహిళా పోలీసులకు ఆదేశించారు. ఎంపీడీఓ గౌరి మాట్లాడుతూ మండల పరిధిలోని బాల కార్మికులను గుర్తించి ఈనెల 12న ప్రపంచ బాలకార్మికుల నిర్మూలన దినోత్సవం రోజున బడికి పంపిస్తామని తెలిపారు. ప్రభుత్వం విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించినా కొందరు తల్లిదండ్రులు ఇవి తెలుసుకోలేక పిల్లలను పనులకు పంపుతున్నారన్నారు. అలాంటి వారిని గుర్తించి ప్రభుత్వం అందిస్తున్న విద్యా కానుక, అమ్మఒడి, విద్యాదీవెన వంటి పథకాలపై అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. తహసీల్దార్ విజయభాస్కర్, శివశంకర్, మురళి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

నేడు రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి జిల్లాకు రాక



చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్ర ఆర్థిక శాఖా మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి శనివారం చిత్తూరు జిల్లాకు విచ్చేయనున్నారు. ఈమేరకు శుక్రవారం కలెక్టరేట్‌కు ఉత్తర్వులు అందాయి. ఆ ఉత్తర్వుల మేరకు ఆర్థిక శాఖ మంత్రి ఈనెల 3 న ఉదయం 11.45 గంటలకు చిత్తూరుకు చేరుకోనున్నారు. మధ్యాహ్నం ఒంటి గంట వరకు జిల్లా కేంద్రంలో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. అనంతరం చిత్తూరు నుంచి బయలుదేరి తిరుపతి జిల్లాకు వెళ్తారని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

గాలివానకు నేలకూలిన 70 విద్యుత్ స్తంభాలు



చిత్తూరులో పునరుద్ధరణ పనులు

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో చిత్తూరు అర్బన్ డివిజన్ పరిధిలో గురువారం రాత్రి కురిసిన గాలీవానకు 70 విద్యుత్ స్తంభాలు నేలకూలాయి.రూ.10 లక్షలు నష్టం వాటిల్లినట్లు ఈఈ పద్మనాభపిళ్లై తెలిపారు. చిత్తూరు నియోజకవర్గంతో పాటు ఆవులకొండ, పెనుమూరు, జీడీనెల్లూరు, పూతలపట్టు, పాలసముద్రం మండలాల్లో మొత్తం 70 విద్యుత్ స్తంభాలు నేలకూలినట్లు పేర్కొన్నారు. దీంతో పాటు 16 ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయని తెలిపారు. డీఈ, ఏఈ, సిబ్బంది సంరక్షణ పనులు చేస్తున్నారని వివరించారు.

బదిలీలకు దరఖాస్తు చేసుకోండి

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఉన్న కేజీబీవీ పాఠశాలల్లో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బంది బదిలీలకు దరఖాస్తు చేసుకోవచ్చని ఏపీసీ వెంకటరమణారెడ్డి శుక్రవారం తెలిపారు. ఈనెల 5 నుంచి 7వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. శాఖాపరమైన చర్యలు, పాలనాపరంగా బదిలీ అయిన వారు అనర్హులని తెలిపారు. అలాంటి వారు ఎస్‌వోల కవరింగ్ లెటర్లను ఈనెల 7 లోపు డీఈవో కార్యాలయంలో అందజేయాలని ఏపీసీ తెలిపారు.

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు పక్షపాతి. అన్నదాతల అభ్యున్నతి కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నారు. గిట్టుబాటు ధర కోసం కూడా ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేశారు. వైఎస్సార్ యంత్ర సేవా పథకం కింద జిల్లాలో 237 గ్రూపులకు రూ.4.17 కోట్ల రాయితీతో 111 ట్రాక్టర్లను పంపిణీ చేశాం' అని రాష్ట్ర అటవీ, విద్యుత్, శాస్త్ర సాంకేతిక, భూగర్భ గనుల శాఖ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. చిత్తూరులో శుక్రవారం వైఎస్సార్ యంత్ర సేవా పథకం జిల్లా స్థాయి కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించి మాట్లాడారు.

వైఎస్సార్ యంత్ర సేవా పథకాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తదితరులు, రైతుల సభలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి





రైతు పక్షపాత ప్రభుత్వం

- పగలే 9 గంటల విద్యుత్ : మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి
- పండుగలా వైఎస్సార్ యంత్ర సేవా పథకం ప్రారంభం
- జెండా ఊపి ప్రారంభించిన మంత్రి పెద్దిరెడ్డి
- రూ.4.17 కోట్ల రాయితీతో 237 సంఘాలకు 111 ట్రాక్టర్ల పంపిణీ
- ఆనందోత్సాహంలో లబ్ధిదారులు

సాక్షి, చిత్తూరు: రైతుల అభ్యున్నతే ధ్యేయంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి పెద్దిరెడ్డి తెలిపారు. రైతులకు వ్యవసాయానికి పగటి పూటే 9 గంటలు విద్యుత్ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గుంటూరులో వైఎస్సార్ యంత్ర సేవా పథకం మేళా ప్రారంభించారు. ఈ సందర్భంగా వర్చువల్ విధానంలో స్థానిక పీవీకే ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో జిల్లాస్థాయి కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 2551 ట్రాక్టర్లు, 100 హార్వెస్టర్లు పంపిణీ చేయగా, చిత్తూరు జిల్లాలో 237 గ్రూపులకు రూ. 4.17 కోట్ల రాయితీతో 111 ట్రాక్టర్లను పంపిణీ చేసనట్లు వివరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్



వైఎస్సార్ యంత్ర సేవా పథకంలో అందజేసిన ట్రాక్టర్లు

మోహన్‌రెడ్డి రైతు పక్షపాతి అని స్పష్టం చేశారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఏపీలో అధికంగా వ్యవసాయ రంగంపై ఆధార పడి ఉన్నారన్నారు. పంటలకు గిట్టుబాటు కల్పించేందుకు ధరల స్థిరీకరణ నిధిని కూడా ఏర్పాటు చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వివరించారు.

రెండు నెలల్లో కుప్పం బ్రాంచ్ కెనాల్

కుప్పం బ్రాంచ్ కెనాల్‌ను రెండు నెలల్లో పూర్తి చేసి ఈ ప్రాంతంలోని అన్ని చెరువులను నీటితో నింపుతామని మంత్రి పెద్దిరెడ్డి తెలిపారు. పడమటి ప్రాంతాల ప్రజలకు సాగు, తాగునీరు అందించేందుకు మూడు రిజర్వాయర్లను నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో 30 లక్షల ఇళ్లను అర్హులైన వారికి మంజూరు చేశామన్నారు. అందులో 22 లక్షల ఇళ్ల నిర్మాణాలు వేగంగా సాగుతున్నాయని తెలిపారు. జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ ప్రభుత్వం పథకాల లబ్ధిని నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు అందజేస్తోందని పేర్కొన్నారు. కమ్యూనిటీ హైరింగ్ సెంటర్ గ్రూపులకు రాయితీపై ట్రాక్టర్లు పంపిణీ చేశామన్నారు

పండుగలా వ్యవసాయం

జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత రైతులకు వ్యవసాయం పండుగలా మారిందని తెలిపారు. ప్రభుత్వం రైతులకు ఏటా రైతు భరోసా కింద పెట్టుబడి సాయం అందిస్తోందని, ఆర్‌బీకేల ద్వారా రైతులకు రాయితీపై విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు సకాలంలో అందజేస్తున్నట్లు పేర్కొన్నారు.

రైతుల అభ్యున్నతే ధ్యేయం

ఎంపీ రెడ్డెప్ప మాట్లాడుతూ రైతుల అభ్యున్నతే ధ్యేయంగా ముఖ్యమంత్రి పనిచేస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్యే అరణి శ్రీనివాసులు మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక వర్షాలు పుష్కలంగా కురుస్తున్నాయని, సాగు,తాగు నీటికి ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. డీసీసీబీ చైర్మన్ రెడ్డెమ్మ మాట్లాడుతూ ఆర్‌బీకేలతో రైతు ముంగిటకే అన్ని సమకూరుతున్నాయన్నారు. వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ యంత్ర సేవ పథకంలో ట్రాక్టర్లు అందజేయడంతోపాటు ఖరీఫ్ సీజన్‌కు సబ్సిడీ వేరుశనగ విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి, మొదలియార్ కార్పొరేషన్ చైర్మ న్ బుల్లెట్ సురేష్, పాలఏకిరి కార్పొరేషన్ చైర్మన్ మురళీ, చిత్తూరు నగర మేయర్ అముద, డీసీసీబీ చైర్మన్ రెడ్డెమ్మ, జెడ్పీ వైస్ చైర్మన్ ధనుంజయరెడ్డి, ఐసీడీఎస్ రాయలసీమ జోనల్ చైర్మన్ శైలజా రెడ్డి, పలమనేరు–కుప్పం– మదనపల్లె అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ వెంకట్ రెడ్డి యాదవ్, జెడ్పీ మహిళా స్థాయి సంఘ చైర్మన్ భారతి, డీఆర్‌ఓ ఎస్.రాజశేఖర్, జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ, ఉద్యానశాఖ డీడీ మధుసూదన్ రెడ్డి, జెడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి, ఆర్డీఓ రేణుక పాల్గొన్నారు.

జగనన్నకు రుణపడి ఉంటాం



ఎలాంటి బ్యాంకు గ్యారెంటీ అవసరం లేకుండా వైఎస్సార్ యంత్ర సేవా పథకం కింద పరికరాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సబ్సిడీతో అందజేయడం ఆనందంగా ఉంది. రూ.7 లక్షల 66 వేల,633 విలువచేసే ట్రాక్టర్‌ను రూ.3 లక్షల 6 వేలకే పొందాం. కల్టివేటర్లు, రోటవేటర్స్, స్ప్రేయర్స్, బేడ్లు మొదలైన పరికరాలన్నీ రూ 5.5 లక్షలకు అందుకున్నాం. ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం. – పి.గిరిబాబు, వెంకటాపురం (ఎస్సాఆర్‌పురం), వైఎస్సార్ రైతు మిత్ర గ్రూపు

కష్టం తీర్చిన ప్రభుత్వం



వైఎస్సార్ యంత్ర సేవా పథకం కింద ట్రాక్టర్, గడ్డి కట్టే యంత్రం, స్ప్రేయర్స్, రోటో వేటర్స్ పరికరాలను సబ్సిడీతో పొందాం. మా గ్రామంలో సుమారు 2 వేల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేస్తారు. ఈ సీజన్లో గడ్డి కట్టే యంత్రం బాగా ఉపయోగపడింది. కూలీల ద్వారా గడ్డి కట్టలు కట్టాలంటే రూ.2 వేలు ఖర్చు అయ్యేది. ఈ మిషన్ ద్వారా రూ.800లే ఖర్చవుతుంది. ప్రభుత్వం రైతుల కష్టాలు తీరుస్తోంది

–ఎన్.శంకర్ రెడ్డి,గంగినాయనపల్లె(బైరెడ్డిపల్లె)

లాభసాటిగా వ్యవసాయం



మా గ్రూపు సభ్యులందరం యంత్ర సేవా పథకం కింద లబ్ధి పొంది లాభసాటిగా వ్యవసాయం చేసుకుంటున్నాం. రూ.8 లక్షల 55 వేల ట్రాక్టర్‌ను రూ. 3లక్షల 22 వేలతో, రోటవేటర్స్, స్ప్రేయర్స్ వంటి పరికరాలను సబ్సిడీతో రైతు పొందాం. సామాన్య రైతులకు రైతు భరోసా కేంద్రాల ద్వారా యంత్ర పరికరాలను అందుబాటులోకి తీసుకొచ్చిన ముఖ్యమంత్రి జగనన్నకు ధన్యవాదాలు. ఆయన వెంటే ఉంటాం.

– జీవీ.దేవేంద్రరెడ్డి,టి.గడ్డూరు(బైరెడ్డిపల్లె)

సురులు,అసురల మధ్యే పోటీ




మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

- చంద్రబాబు మ్యానిఫెస్టో ఓ అబద్ధాల పుట్ట
- 2024 ఎన్నికల్లో జగనన్న ఒక్కరే అభ్యర్థి
- డిప్యూటీ సీఎం నారాయణస్వామి

కార్వేటినగరం: రానున్న సారస్వత ఎన్నికల్లో సురులు, అసురుల మధ్యే పోటీ ఉంటుందని అందులో గెలిచిదే దేవతలు లాంటి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులేనని ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. శుక్రవారం కొటార్వేడులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ చంద్రబాబు అధికార దాహాన్ని తీర్చేందుకు ఎల్లో మీడియా ఆరాటపడుతోందని ఆరోపించారు. ఎస్సీగా పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా అని చంద్రబాబు అన్నప్పుడే నిజమైన ఎస్సీ తెలుగు దేశం శ్రేణులు తమ పదవులకు రాజీనామా చేసి ఉండాలని, అప్పుడే అంబేడ్కర్ ఆత్మ శాంతించి ఉంటుందని అన్నారు. అధికారం కోసం చంద్రబాబు కర్ణాటక కాంగ్రెస్ మేనిఫెస్టోను కాపీ కొట్టి రాష్ట్ర ప్రజలను మోసం చేసేందుకు చూస్తున్నారని, బాబు మ్యానిఫెస్టో ఓ అబద్ధాల పుట్టని, ప్రజలు నమ్మే స్థితిలో లేరని విమర్శించారు. రాక్షస మనస్తత్వం కలిగిన చంద్రబాబు మామ ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడిచి అధికారంలోకి రావడమే కాకుండా వారి కుటుంబసభ్యులను మభ్యపెట్టి తన వైపు తిప్పుకుని ఎన్టీఆర్ ఆత్మ క్షోభించేలా చేసిన రావణాసురుడని ఆరోపించారు. జగనన్నను దెబ్బతీయాలని కోటీశ్వర్లంతా ఒక్కటై చంద్రబాబు పక్షాన ఉన్నారని పేర్కొన్నారు. అన్ని సామాజిక వర్గాలను ఆర్థికంగా అభివృద్ధి చేయడమే ధ్యేయంగా పని చేస్తున్నారని పేర్కొన్నారు. గతంలో ప్రతి ఒక్కరూ పేదవారేనని, ఒకప్పుడు చంద్రబాబు తండ్రి ఖర్జూరపునాయుడు కూడా పేదవాడేనని, ఈ విషయం మరచి చంద్రబాబు పేదలను హీనంగా చూస్తూ, ధనికుల పక్షాన నిలుస్తున్నారని విమర్శించారు. 'నావల్ల మీ కుటుంబాలు ఆర్థికంగా బాగుపడి ఉంటే, మీ పిల్లలు చదువుకుని బాగుపడి ఉంటే, నేను చేసే పనులు నచ్చి ఉంటేనే నాకు ఓట్లు వేయండి' అని చెప్పిన ఏకైక ముఖ్యమంత్రి జగనన్న మాత్రమేనని అభివర్ణించారు. నేడోరేపో స్కిల్ స్కామ్‌లో బాబుకు శిక్ష తప్పదని, అదే విధంగా మార్గదర్శిలో రామోజీకి కూడా అదే పరిస్థితి అని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో జగనన్న ఒక్కరే అభ్యర్థి అని, ఆయన గాలిలో అభ్యర్థులందరూ గెలుస్తారని, సంక్షేమ పథకాలే గెలుపునకు దోహదపడుతాయని నారాయణస్వామి తెలిపారు.

ఉమ్మడి జిల్లా పరిధిలో జర్నలిస్టులకు బస్ పాసులు

- 298 మందికి అక్రిడిటేషన్ కార్డులు మంజూరు
- కమిటీ సమావేశంలో కలెక్టర్ షణ్మోహన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో జర్నలిస్టులకు ప్రభుత్వం బస్సు పాస్ సౌకర్యం కల్పించిందని కలెక్టర్ షణ్మోహన్ వెల్లడించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో చిత్తూరు జిల్లా అక్రిడిటేషన్ కమిటీ తొలి సమావేశం జరిగింది. కమిటీ చైర్మన్, కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 38 ప్రకారం జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు మంజూరు చేసినట్లు తెలిపారు. వివిధ మీడి యా సంస్థల నుంచి అక్రిడిటేషన్‌లకు దరఖాస్తు చేసుకున్న 298 మందికి మొదటి సమావేశంలో మంజూరు చేసినట్లు తెలిపారు. 2023–2024 రెండు సంవత్సరాల కాల పరిమితితో అక్రిడిటేషన్లు ఇవ్వనున్నట్లు చెప్పారు. నిబంధనల మేరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్న జర్నలిస్టులకు, పీరి యాడికల్, వెటరన్ జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం అక్రెడిటేషన్ మంజూరు కాని వారు నిబంధనల మేరకు డాక్యుమెంట్స్ ఆన్‌లైన్‌లో మరోసారి సమర్పించిన తర్వా త పరిశీలించి మంజూరు చేస్తామన్నారు. అక్రిడిటేషన్ గడువు ఉండేంత వరకు బస్ పాస్‌ను ఒకేసారి మంజూరు చేస్తే ఉపయోగంగా ఉంటుందని కమిటీ సభ్యులు కలెక్టర్‌ను కోరారు. దీనిపై ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. కమిటీ కన్వీనర్, డీఐపీఆర్‌వో పద్మజ, సభ్యులు శివప్రసాద్, ఉమాశంకర్, వెంకటరత్నం, జయరాజ్, శ్రీకాంత్, సురేంద్రరెడ్డి, కార్మిక శాఖ అధికారి ఓంకార్, ఏపీఎస్ ఆర్టీసీ పర్సనల్ ఆఫీసర్ సెహజాన్, గృహ నిర్మాణ శాఖ మేనేజర్ దొడ్డప్ప, ఇన్‌చార్జి డీఎంఅండ్‌హెచ్‌వో రాజశేఖర్‌రెడ్డి, ఏపీవో వెంకటరమణ పాల్గొన్నారు.

పూతలపట్టులో పచ్చకుట్రలు

పూతలపట్టు మండలంలో పచ్చకుట్రలు తారాస్థాయికి చేరాయి. వైఎస్సార్‌సీపీకి జనం నుంచి వస్తున్న ఆదరణను చూసి తట్టుకోలేక అన్ని పథకాల ప్రయోజనాలు పొందుతున్నా ప్రభుత్వంపై బురదజల్లడమే ప్రణాళికగా పచ్చనేతలు కుట్రలు పన్నుతున్నారు. సామాన్య ప్రజలపై దాదాగిరి చేస్తున్నారు. వైఎస్సార్ సీపీ దళిత ఎమ్మెల్యే గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమానికి వస్తే గ్రామంలో ఉండకూడదని హుకుం జారీ చేస్తున్నారు. టీడీపీ రౌడీయిజం చేసే చోట మాత్రమే ఈ తతంగం నడుస్తోంది. ప్రజలను భయపెట్టి ప్రభుత్వానికి చెడ్డపేరు తేవాలని పచ్చనేతలు చేస్తున్న కుట్రలపై గ్రామీణ సామాన్య జనం మండిపడుతోంది.

- సామాన్య ప్రజలపై టీడీపీ జులుం
- ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం
- గడపగడపకు వస్తే ఊర్లో ఉండకూడదని హుకుం
- కుల రాజకీయాలకు ఆజ్యం
- మండిపడుతున్న గ్రామీణ జనం

యాదమరి(పూతలపట్టు): పూతలపట్టు నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఎంఎస్‌బాబుకు ప్రజల నుంచి లభిస్తున్న ఆదరణను చూసి టీడీపీ శ్రేణులు తట్టుకోలేక పోతున్నాయి. నియోజకవర్గంలో 60 వేలకు పైగా కుటుంబాలు ఉన్నాయి. గతనాలుగేళ్ల కాలంలో 50 వేల కుటుంబాలకుపైగా ప్రభుత్వ పథకాలు అందుతున్నాయి. జనం సమస్య తీర్చడానికి సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ప్రజల వద్దకు వెళుతున్నారు. ఎమ్మెల్యే, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజల్లోకి వెళ్లాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం గతేడాది గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. దీంతో ప్రజల నుంచి ప్రభుత్వం భేష్ అనే ముద్రను వేసుకుంది. ప్రభుత్వ పథకాల అమలుపై టీడీపీ సానుభూతిపరులు కూడా సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇది తట్టుకోలేక పార్టీ అధినేత చంద్రబాబు డైరెక్షన్‌లో నాయకులు కుట్రలకు తెరతీశారు. ప్రభుత్వంపై తప్పుడు ప్రచారాలు చేయడమే పనిగా పెట్టుకున్నారు. స్థానిక టీడీపీ నేతలు ప్రజలను భయపెడుతూ.. మేం చెప్పిందే చేయాలని నాయకులు బెదిరింపులకు దిగుతున్నారు. గడపగడపకు వస్తే ఇంటికి తాళం వేసి వెళ్లి పోవాలని భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ప్రభుత్వ పాలన నచ్చక ప్రజలే స్వచ్ఛందంగా ఇంటికి తాళం వేస్తున్నట్లు పక్కదారి పట్టించేలా వ్యవహరిస్తోంది. కుల రాజకీయాలకు ఆజ్యం పోయిస్తున్నారు. అక్కడి టీడీపీ ఘోరాలను గడపగడపకు కార్యక్రమం ముగిసిన అనంతరం ఎమ్మెల్యే వద్ద పలువురు పేదలు వివరిస్తున్నారు. పూతలపట్టు మండలం పేట ఆగ్రహారం గ్రామంలో దళిత ఎమ్మెల్యే గడప గడపకు కార్యక్రమంలో టీడీపీ నేతలు ఇళ్లకు తాళాలు వేశారు. అనంతరం వీధులను పసుపు నీళ్లతో కడిగారు. బంగారుపాళ్యం మండలం 170 గొల్లపల్లెలో కూడా టీడీపీ శ్రేణులు ఇళ్లకు తాళాలు వేయాలని హుకుం జారీ చేసి, ఆమేరకు తాళాలు వేయించారు. ఈ ఘటనలపై సర్వత్రా నిరసన వ్యక్తం అయ్యింది. మరిన్ని గ్రామాల్లో కూడా గడపగడప కార్యక్రమాన్ని అడ్డుకోవాలని టీడీపీ శ్రేణులు కుట్రలు చేస్తున్నట్లు ఆయా గ్రామస్తుల సమాచారం.



170 గొల్లపల్లెలో తాళాలు వేసిన టీడీపీ మద్దతుదారుల ఇళ్లు



గడప గడపకు కార్యక్రమంలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

ఎమ్మెల్యే రాకతో సమస్యలు తీరుతున్నాయి



ఎమ్మెల్యే ఎంఎస్‌బాబు గ్రామాలకు రావడంతో మా సమస్యలు పరిష్కారం అవుతున్నాయి. గడపవద్దకే వచ్చి సమస్యలు అడిగి తెలుసుకొని వెంటనే పరిష్కరిస్తున్నారు. రెండు రోజుల కిందట మాగ్రామానికి ఎమ్మెల్యే వస్తే టీడీపీ సానుభూతిపరులు కావాలనే తాళాలు వేసుకుని వెళ్లిపోయారు. మేము టీడీపీ నేతల మాటలు వినాల్సిన అవసరం లేదు. మాకు సమస్యలు పరిష్కారం అయితే చాలు.

లోకేష్,170 గొల్లపల్లె (బంగారుపాళెం)

పథకాలు ఇచ్చేవారికి ఎప్పుడు ఆహ్వానమే




ప్రభుత్వ పథకాలు పార్టీల కతీతంగా అందుతున్నాయి. ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు మా గ్రామానికి వస్తే ఆహ్వానిస్తాం. గతంలో ఎన్నడు లేని విధంగా ప్రభుత్వ పథకాలు పార్టీలకు అతీతంగా లబ్ధిదారులకు అందుతున్నాయి. మాగ్రామానికి ఎమ్మెల్యే వస్తున్నారని రెండు రోజుల కిందట టీడీపీ సానుభూతిపరులు ఇళ్లకు తాళాలు వేసి వెళ్లడం దారుణం. నిజంగా గ్రామాభివృద్ధి కోసం కృషి చేసేవారతే ఎమ్మెల్యే వచ్చినప్పుడు సమస్యలను తెలియజేయాలి.

–సుకుమార్, గుంతూరు గ్రామం


తూకాల్లో మోసాలను సహించం

బంగారుపాళెం: ర్యాంప్ నిర్వాహకులు మామిడి తూకాల్లో తేడాలు రాకుండా చూడాలని హార్టీకల్చర్ డీడీ మధుసూదర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం బంగారుపాళెం మండలంలోని తిమ్మోజుపల్లె వద్ద ర్యాంప్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు గిటుబాటు ధర ఇచ్చేలా వ్యవహరించాలన్నారు. కాటాల ద్వారా వేసే తూకాలలో మోసం జరగకుండా గ్రామ కార్యదర్శులు పర్యవేక్షించాలన్నారు. తూకాల్లో మోసాలను సహించిలేదని స్పష్టం చేశారు. లోడింగ్ ప్రక్రియలో మామిడి కాయలు దెబ్బతినకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. గ్రామ కార్యదర్శి నూర్‌మహ్మద్, ర్యాంప్ నిర్వాహకుడు బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



ర్యాంప్‌ను పరిశీలిస్తున్న డీడీ మధుసూదన్‌రెడ్డి

ఇన్‌చార్జ్ డీఎంఅండ్‌హెచ్‌గా రాజశేఖర్‌రెడ్డి



చిత్తూరు రూరల్: ఇన్‌చార్జ్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా రాజశేఖర్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. డీఎంహెచ్‌ఓ జి.ప్రకాశం నెలరోజులపాటు సెలవుల్లోకి వెళ్లారు. దీంతో జిల్లా ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ రాజశేఖర్‌రెడ్డికి అదనపు బాధ్యతలను అప్పగించారు. ఆయన మాట్లాడుతూ వైద్య, ఆరోగ్యశాఖలోని సమస్యలను పరిష్కరించడంతో పాటు సేవలను మెరుగు పరిచేలా చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు.

క్లుప్తంగా

లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలి


మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ, అనుబంధ శాఖలకు నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ సగిలి షణ్మోహన్ ఆదేశించారు. శుక్రవారం మధ్యాహ్నం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వ్యవసాయ, అనుబంధ శాఖలైన మత్స్య, పట్టు పరిశ్రమ, పశుసంవర్ధక, ఏపీఎంఐపీ, ఉద్యాన,వ్యవసాయ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ముందుగా మత్స్య శాఖ ద్వారా చేపట్టే కార్యక్రమాలు, నిర్దేశించిన లక్ష్యాను ఆ శాఖ డీడీ వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ పట్టు పరిశ్రమ శాఖ పరిధిలో కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. జిల్లాలో ఈ సంవత్సరం మూడు వేల ఎకరాల్లో మల్బరీ సాగు చేసే విధంగా ప్రోత్సహించాలని తెలిపారు. ఉద్యానశాఖ ద్వారా రైతులకు మేలు రకమైన కూరగాయలు, పండ్ల తోటల పెంపకంపై అవగాహన కార్యక్రమాలు, లక్ష్యాలను ఆశాఖ డీడీ కలెక్టర్‌కు వివరించారు. ఇకపై మండలాల వారీగా సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. పలమనేరు డివిజన్, కుప్పం ప్రాంతంలో 20 వేల హెక్టార్లలో చిరుధాన్యాలు సాగు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ డీఏఓ ను ఆదేశించారు.

కర్ణాటక మద్యం పట్టివేత


నిందితుల అరెస్ట్ చూపుతున్న అధికారులు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని పాతబస్టాండు ప్రాంతంలో శుక్రవారం అర్బన్ ఎస్ఈబీ అధికారులు జరిపిన దాడుల్లో సంపత్‌కుమార్ (35) అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని, 16 కర్ణాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. అలాగే గుడిపాల మండలం 189 కొత్తపల్లెలో 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. అనుప్పల్లెకు చెందిన పయణి అరెస్ట్ చూపి, రిమాండ్‌కు తరలించారు. సీఐ జోగేంద్ర, ఎస్‌ఐలు బాబు, పృథ్వీ, సిబ్బంది బాబు, శంకర్‌నాయక్, పతిలిబాయి, వెంకటేశ్వర్లు, జయశంకర్, షమ, జ్యోతి తదితరులు ఈ దాడుల్లో పాల్గొన్నారు.

జిల్లాలో ఎక్కువగా సాగవుతున్న తోతాపురి రకం మామిడి కోతలు ఈనెల తొలివారం నుంచి మొదలు కానున్నాయి. ఇప్పటికే కొన్ని మామిడి పల్ప్ ఫ్యాక్టరీలు రైతులతో అగ్రిమెంట్లు చేసుకుని డైరెక్ట్ మార్కెటింగ్ చేస్తుండగా.. మరికొన్ని ఫ్యాక్టరీలు ఏజెంట్లు, వ్యాపారుల ద్వారా మామిడిని ర్యాంపుల నుంచి కొనుగోలు చేయనున్నాయి. ఈదఫా ఉమ్మడి జిల్లాలో జిల్లా అధికారులు తీసుకుంటున్న చర్యలతో మామిడి రైతులకు గిట్టుబాటు లభిస్తోంది. ప్రైవేటు ర్యాంపుల వద్ద తూకాల్లో మోసాలు జరక్కుండా హార్టికల్చర్ అసిస్టెంట్ల పర్యవేక్షణతో అమ్మకాలు జరిగేలా చర్యలు తీసుకున్నారు. జిల్లాలోని ప్రధాన మామిడి మార్కెట్లలో కొనుగోళ్లు మొదలైయ్యాయి. మామిడి గుజ్జు తయారీకి ఫ్యాక్టరీలు సన్నద్ధమవుతున్నాయి.


తోతాపురిరకం మామిడి కాయలు

తోతాపురి వచ్చేస్తోంది..

- ఈనెల మొదటివారం నుంచి ఆగస్టు వరకు సీజన్
- దఫాలుగా కోస్తేనే గిట్టుబాటు ధర
- జిల్లాలోని ప్రధాన మార్కెట్లలో మొదలైన కొనుగోళ్లు
- మామిడి 60 శాతం జ్యూస్ ఫ్యాక్టరీలకే..
- ప్రైవేటు ర్యాంపుల వద్ద హార్టీకల్చర్ అసిస్టెంట్ల నిఘా
- కోతలపై హార్టీకల్చర్ అధికారుల అవగాహన


పలమనేరు మండలం జగమర్లలో కోతలపై అవగాహన కల్పిస్తున్న హెచ్ఓ లక్ష్మీప్రసూన

పలమనేరు: ఉమ్మడి జిల్లాలో తోతాపురి రకం మామిడి సీజన్ ప్రారంభమైంది. జిల్లాలో 20 వరకు మామిడి పల్ప్(గుజ్జు) పరిశ్రమలున్నాయి. దిగుబడిలో 60 శాతం జిల్లాతోపాటు పొరుగు రాష్ట్రాల్లోని పల్ప్ ఫాక్టరీలకు చేరుతోంది. మామిడి కాయలను పల్ప్(మామిడి గుజ్జు)గా తయారుచేసి ఇతర రాష్ట్రాలకే కాక విదేశాలకు సైతం ఎగుమతులు చేస్తుంటారు. ఏటా జూన్ తొలివారం నుంచి నుంచి జూలై చివరివారం, ఆగస్టు తొలివారం దాకా ఇక్కడ సీజన్ నడుస్తుంది. విజయవాడ, రాయచోటి తదితర ప్రాంతాల్లో ముందుగానే సీజన్ ప్రారంభం కావడంతో అక్కడి టేబుల్ ఐటిమ్స్(తినే పండ్లు) జిల్లాలోకి వస్తున్నాయి. ప్రధానంగా జిల్లాలో ఎక్కువగా సాగవుతున్న తోతాపురి జూన్ తొలివారం నుంచి కోతలు మొదలు కానున్నాయి. ఇప్పటికే కొన్ని మామిడి పల్ప్ ఫ్యాక్టరీలు రైతులతో అగ్రిమెంట్లు చేసుకుని డైరెక్ట్ మార్కెటింగ్ చేసుకుంటున్నాయి. మరికొన్ని ఫ్యాక్టరీలు తమ ఏజెంట్లు, వ్యాపారుల ద్వారా మామిడిని ర్యాంపుల నుంచి కొనుగోలు చేసేందుకు చర్యలు ప్రారంభించారు. మిగిలిన రైతులు జిల్లాలోని దామల్‌చెరువు, తిరుపతి, బంగారుపాళ్యం, పుత్తూరు, చిత్తూరు, పలమనేరు, వీకోటలో మామిడి మండీలకు పంట దిగుబడిని తరలిస్తారు. జిల్లాలో 60 శాతం జ్యూస్ ఫ్యాక్టరీలకు, 20 శాతం తోటలపై వ్యాపారుల కొనుగోళ్లు, మరో 20 శాతం రైతులు ప్రధాన మార్కెట్‌లలో ఏటా విక్రయిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో సాగు ఇలా..

- మామిడి సాగు1.12 లక్షల హెక్టార్లు
- మామిడి రైతులు దాదాపుగా 60 వేలు
- ఈదఫా కాపుకాచిన తోటలు: 87వేల హెక్టార్లు
- ప్రధాన వెరైటీలు:తోతాపురి, నీలం, ఖాదర్
- జిల్లాలో తోతాపురి సాగు: 68వేల హెక్టార్లు
- మొత్తం పంట దిగుబడి: 8లక్షల టన్నులు
- తోతాపురి దిగుబడి మాత్రమే 4.5లక్షల టన్నులు

మామిడి ర్యాంపుల్లో అక్రమాలకు చెక్

జిల్లాలోని మామిడి ర్యాంపుల వద్ద తూకాల్లో అక్రమాలకు పాల్పడే వ్యాపారులపై చర్యలు తప్పవు. చిత్తూరు జిల్లాలో 33 చోట్ల మామిడి ర్యాంపులున్నాయి. వ్యాపారులు తూకాల్లో మోసం చేయకుండా లీగల్ మెట్రాలజీ శాఖ నుంచి శిక్షణ పొందిన ఆర్‌బీకే సిబ్బంది పర్యవేక్షణలో ఈదఫా మామిడి అమ్మకాలు చేపడుతున్నాం. గిట్టుబాటు ధర లభించాలంటే ఒకేసారి కాకుండా దఫ, దఫాలుగా మార్కెట్ ధరలను అనుసరించి కోతలు కోయాలి. జిల్లాలో మామిడి కాత తక్కువగా ఉన్న కారణంగా ధర ఎక్కువగా పలికే అవకాశం ఉంది. –మధుసూదన్‌రెడ్డి, జిల్లా ఉద్యానశాఖ అధికారి



అధికారుల సూచనలు పాటించాలి

అధికారులు చెప్పినట్టు రైతులు ఒకేసారి సరుకును మార్కెట్‌కు తీసుకురాకుండా దఫదఫాలుగా తెస్తే గిట్టుబాటు ధర లభిస్తుంది. కూలీల డిమాండ్ కారణంగా రైతులు ఒకేసారి కాయలను కోతకోస్తుంటారు. ఈ దఫా అధికారుల సూచనలను పాటిస్తే రైతులు మంచి గిట్టుబాటు ధరలు పొందవచ్చు. –నియాజ్, మామిడి మండీ వ్యాపారి, పలమనేరు



ట్రాక్టర్ బోల్తా: మాజీ సైనికుడు మృతి


గోపీనాథ్(ఫైల్)

ఐరాల: మండలంలోని వేదగిరివారిపల్లెలో శుక్రవారం సాయంత్రం ట్రాక్టర్ బోల్తా పడిన ప్రమాదంలో మాజీ సైనికుడు గోపీనాథ్ (32) మృతి చెందారు. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. ఇంటి వద్ద నుంచి గ్రామం సమీపంలోని సొంత కోళ్ల ఫారం షెడ్డు వద్దకు గోపీనాథ్ ట్రాక్టర్‌లో వెళుతున్నారు. మార్గమధ్యంలో ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ట్రాక్టర్ నడుపుతున్న ఆయన కింద పడ్డాడు. ఈయన మీద ట్రాక్టర్ పడడంతో సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. ఈయనకు భార్య దివ్యశ్రీ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.


చిత్తూరు బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.62,350
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,500
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.74,000
రిటైల్ వెండి గ్రాము	రూ.77

ప్రమాదాల నివారణకు దీర్ఘకాలిక ప్రణాళికలు

తిరుమల : తిరుమల ఘాట్ రోడ్లలో ప్రమాదాల నివారణకు దీర్ఘకాలిక ప్రణాళికలు సిద్ధం చేయాలని టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి అధికారులను ఆదేశించారు. ఘాట్ రోడ్లలో ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శుక్రవారం టీటీడీ పరిపాలన భవనంలో తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటరమణా రెడ్డి, జిల్లా ఎస్పీ పరమేశ్వరరెడ్డితో పాటు వివిధ శాఖల అధికారులు, టీటీడీ అధికారులతో ఈవో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు ఇవీ.

- మొదటి (డౌన్) ఘాట్ రోడ్డులో 1వ మలుపు, 7వ మైల్, అలిపిరి డౌన్ గేట్, అప్ ఘాట్ రోడ్డులో లింక్ రోడ్డు, సహజ సిద్ధంగా ఏర్పడిన ఆర్చి (గరుడ ఆకారం), దివ్యారామం ప్రాంతాల్లో చెక్ పాయింట్లు ఏర్పాటు చేయాలి.
- రెండవ (అప్) ఘాట్ రోడ్డులో లాగా డౌన్ ఘాట్ రోడ్డులో కూడా కాంక్రీట్ రీటైనింగ్ వాల్స్ నిర్మించాలి.
- ఏ రకమైన వాహనాలను ఘాట్ రోడ్డులో నిషేధించవచ్చో ప్రణాళికలు సిద్ధం చేయాలి.
- ప్రమాదాల నివారణకు సూచిక బోర్డులను విరివిగా ఏర్పాటు చేయాలి.
- ఘాట్ రోడ్లలో వాహనాలు నడిపేవారు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలిపేలా నిరంతరం కరపత్రాలు పంపిణీ చేయాలి.
- అంబులెన్స్‌లు , రెస్క్యూ టీమ్‌లు అవసరమైన పరికరాలతో సదా సన్నద్ధంగా ఉండాలి.
- ఘాట్ రోడ్లలో ఆర్టీసీ బస్సుల డ్రైవర్లు ఓవర్‌టేక్ చేయకుండా చర్యలు తీసుకోవాలి.

ఈ సమావేశంలో జేఈవోలు సదా భార్గవి, వీరబ్రహ్మం, సీవీఎస్వో నరసింహ కిషోర్, ఎఫ్ఏసీఏవో బాలాజి, చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు, టీటీడీ ఇంజినీరింగ్ సలహాదారు రామచంద్రారెడ్డి, స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ వెంగమ్మ , బర్డ్ ఆసుపత్రి ప్రత్యేకాధికారి డాక్టర్ రెడ్డెప్ప రెడ్డి, డాక్టర్ రవి ప్రభు, అదనపు ఎస్పీ మునిరామయ్య, ఆర్టీసీ ఆర్ఎం చెంగల్ రెడ్డి పాల్గొన్నారు.

వైభవం..గోవిందుని రథోత్సవం


రథోత్సవంలో పాల్గొన్న అశేష భక్తులు


రథంలో కొలువుదీరిన స్వామివారు

తిరుపతి కల్చరల్ : శ్రీగోవిందరాజస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు శుక్రవారం ఉదయం రథోత్సవం వైభవంగా జరిగింది. సర్వాలంకారభూషితుడైన అనంత తేజోమూర్తి రథాన్ని అధిరోహించగా, అశేష భక్తుల గోవింద నామస్మరణలు, చెక్కభజనలు, కోలాట ప్రదర్శనలు, మంగళవాయిద్యాల నడుమ స్వామి వారి రథోత్సవం సాగింది. అడుగడుగునా భక్తులు కర్పూర హారతులు సమర్పించారు. పానీయాలతో పాటు విసన కర్రలు వితరణ చేశారు. దారి పొడవునా భక్తులు మిరియాలు, కలకండను స్వామి వారి రథంపై చల్లుతూ మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి 7 నుంచి 9 గంటలకు స్వామివారు అశ్వవాహనం అధిరోహించి మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు.

పది సప్లిమెంటరీ పరీక్షలకు 364 మంది గైర్హాజరు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా శుక్రవారం పదవ తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు 364 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జిల్లాలోని 28 పరీక్ష కేంద్రాల్లో మొదటిరోజు పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని డీఈవో విజయేంద్రరావు తెలిపారు. ఈ పరీక్షలకు 2,681 మంది విద్యార్థులకు గాను 2,311 మంది హాజరైనట్లు తెలిపారు. 13 పరీక్ష కేంద్రాలకు ఫ్లైయింగ్ స్క్వాడ్ సభ్యులు తనిఖీలు చేశారన్నారు.

విద్యార్థిని అదృశ్యం

సదుం: మండలంలోని ఇంటర్ విద్యార్థిని అదృశ్యంపై ఫిర్యాదు అందినట్టు ఎస్ఐ మారుతి శుక్రవారం తెలిపారు. ఆయన కథనం మేరకు..మండలానికి చెందిన మైనర్ యువతి(17) గురువారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేసి నిద్రపోయింది. రాత్రి 2 గంటల సమయంలో తండ్రి లేచి చూడగా యువతి ఇంట్లో లేదు. చుట్టుపక్కల గాలించినా ఆచూకీ తెలియక పోవడంతో శుక్రవారం ఆమె తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదులో మహేష్ అనే యువకుడిపై అనుమానం వ్యక్తం చేసింది.

మున్సిపల్ ఇంజినీర్ బదిలీ

చిత్తూరు అర్బన్: చిత్తూరు మున్సిపల్ ఇంజనీర్ ధనలక్ష్మిని రాష్ట్రప్రభుత్వం బదిలీచేస్తూ ఉత్తర్వులు శుక్రవారం జారీచేసింది. చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న ధనలక్ష్మిని బదిలీచేసి రాష్ట్ర విక్కో కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశాలు జారీచేశారు. కానీ ఆమె స్థానంలో ప్రభుత్వం ఎవరినీ నియమించలేదు.

తెప్పపై శ్రీపద్మావతి అమ్మవారి కటాక్షం


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు


తెప్పపై విహరిస్తున్న పద్మావతీ అమ్మవారు

తిరుచానూరు(చంద్రగిరి) : తిరుచానూరులో కొలువైన శ్రీవారి దేవేరి శ్రీపద్మావతి అమ్మవారి వార్షిక తెప్పోత్సవాల్లో భాగంగా 3వ రోజు శుక్రవారం సాయంత్రం అమ్మవారు తెప్పపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. మధ్యాహ్నం 3గంటలకు అమ్మవారిని ఆలయం నుంచి వేంచేపుగా పుష్కరిణి మధ్యలో ఉన్న నీరాడ మండపానికి తీసుకొచ్చి కొలువుదీర్చారు. అనంతరం ఆలయ అర్చకులు వైభవంగా అభిషేకం నిర్వహించారు. సాయంత్రం 6.30గంటలకు అమ్మవారు తెప్పపై కొలువుదీరి పుష్కరిణిలో మూడు పర్యాయాలు విహరిస్తూ భక్తులకు దివ్యదర్శనం కల్పించారు. రాత్రి 7.30గంటలకు సర్వాంగ శోభితురాలైన శ్రీపద్మావతి అమ్మవారు తిరుచ్చిపై తిరువీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ డెప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈఓ రమేష్, సూపరింటెండెంట్లు శేషగిరి, మధు, అర్జితం, వాహనం ఇన్‌స్పెక్టర్లు ప్రసాద్, సుభాష్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నేడు గజవాహన సేవ

తెప్పోత్సవాల్లో భాగంగా నాలుగో రోజైన శనివారం రాత్రి 8.30గంటలకు శ్రీపద్మావతి అమ్మవారు గజవాహనంపై తిరువీధుల్లో ఊరేగుతూ భక్తులను ఆశీర్వదించనున్నారు.